క్లుప్తంగా

అమ్మవారికి మహాభిషేకం



విద్యానగర్(కరీంనగర్): శ్రీ దుర్గాభవానీ శరన్నవరాత్రోత్సవాల ప్రారంభంలో భాగంగా శనివారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ అమ్మవారికి విశేష ద్రవ్యాలతో మహాభిషేకం నిర్వహించి, విశేష పూజలు, హారతులిచ్చారు. అనంతరం నవరాత్రోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ మాట్లాడుతూ దుర్గాభవానీ అమ్మవారు తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమిస్తుందని అన్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పూజారికి చెక్కు అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని హన్మాన్ ఆలయం పూజారి ఎస్.రామకృష్ణకు శనివారం కందుల రాజన్న పటేల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కందుల సాగర్, వైస్ చైర్మన్ కందుల సందీప్, సభ్యులు తోట సాగర్, సంకినేని రాణాప్రతాప్‌రావు, బండారి అమర్, పెద్ది సందీప్, నరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పొన్నాలపై రేవంత్ అనుచిత వ్యాఖ్యలకు నిరసన



కరీంనగర్‌టౌన్: మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి మున్నూరు కాపులకు వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్ అన్నారు. శనివారం నగరంలోని తెలంగాణచౌక్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ సీనియర్ రాజకీయ నాయకులు పొన్నాల లక్ష్మయ్యకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, కర్ర రాజశేఖర్, ఏవీ రమణ, అనంతుల రమేశ్, మడికంటి మారుతి, తోట కోటేశ్వర్, కొట్టె మల్లేశం, సంతోష్‌పటేల్, ముప్పిడి సునీల్, పెంట శ్రీను, కొడారి శ్రీపాల్, కొత్త శ్రీధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



భగత్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మేయర్ సతీమణి అపర్ణ



శ్రీవేంకటేశ్వర కాలనీలో..



రాంనగర్‌లో బతుకమ్మ సంబరాల్లో డిప్యూటీ మేయర్ స్వరూపారాణి

ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ వేడుకలు శనివారం కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఓ చోట పెట్టి మహిళలు పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం వాయినాలు ఇచ్చుకుంటూ ఉత్సాహంగా పలకరించుకున్నారు.

- కరీంనగర్/కరీంనగర్‌కల్చరల్/సప్తగిరికాలనీ/విద్యానగర్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి



సూర్యనగర్‌లో..



జ్యోతినగర్‌లోని కమల పెరల్స్ అపార్ట్‌మెంట్‌లో..





విద్యారణ్యపురి రోడ్ నం.2లో..



చెర్లభూత్కూర్‌లో బతుకమ్మలతో మహిళలు



గోకుల్‌నగర్‌లో..



కొత్తపల్లిలో ..



బాలసదన్‌లో ..



కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ..



ఎస్సీజేసీ బాలికల కళాశాలలో..



తాహెర్‌కొండాపూర్‌లో..



చెర్లభూత్కూర్‌లో..

ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్రంలో డీఎస్సీ, గ్రూప్–1, 2 పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం వల్ల యువత మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వీరి ఆత్మహత్యలకు టీఎస్‌పీఎస్సీ, కేసీఆర్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేశ్, తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో ప్లకార్డులతో రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి నేడు ఎన్నికల కోడ్‌తో వాయిదా వేయడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగాలు వస్తాయని నగరాల్లో లక్షలు ఖర్చు చేసి ప్రిపేర్ అవుతున్నారని, పరీక్షల వాయిదాతో హైదరాబాద్‌లో యువతి ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి రఘుపతి, నాయకులు నవీన్, గోపి, రాజేందర్ పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ సప్తగిరికాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, తెలంగాణచౌక్, కాశ్మీర్‌గడ్డ, ముకరంపుర, గోదాంగడ్డ, భగత్‌నగర్, సప్తగిరికాలనీ, శ్రీనగర్‌కాలనీ, రాంచంద్రాపూర్ కాలనీ, శివాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 33/11 కేవీ టవర్‌సర్కిల్, అంబేడ్కర్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ టవర్‌సర్కిల్, డాక్టర్స్ స్ట్రీట్, గాంధీ, కిసాన్‌నగర్, సుభాష్‌నగర్, మంచిర్యాల ఎక్స్ రోడ్ ఫీడర్లతో పాటు తీగలగుట్టపల్లి ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ పేర్కొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న ఐలయ్య

కొత్తపల్లి: ఆరోగ్యమే మహాభాగ్యమని సైకాలజిస్ట్ మెమొరీ ట్రైనర్ సోరుపాక ఐలయ్య అన్నారు. ప్రపంచ మానసిక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రేకుర్తిలోని సాన్వీ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాలలో శనివారం మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతీ మనిషి అనవసర విషయాలపై సుదీర్ఘ ఆలోచన చేస్తూ మానసిక వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఆందోళనకు గురవుతూ ఒత్తిడికి లోనవుతూ అనారోగ్యాలకు గురువుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మానసిక సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే ఏ విషయంపై అతిగా ఆలోచించకుండా పుస్తక పఠనం, యోగా, మెడిటేషన్, సంగీతం వినాలని సూచించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రా మల్లేశం, అలయన్స్ జిల్లా గవర్నర్ గాలిపల్లి నాగేశ్వర్, క్లబ్ అధ్యక్షుడు వేణుమాధవ్, కళాశాల యాజమాన్యం ఎర్రంశెట్టి మునీందర్, సిరిపురం ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



టవర్ సర్కిల్‌లోని మండపం



బోయవాడలో..

- ముస్తాబైన మండపాలు, ఆలయాలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పలు వీధులు, ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు మండపాలు సిద్ధమయ్యాయి. ఆదిపరాశక్తి జగత్‌జననీ, అవతార రూపిని అయిన దుర్గాదేవికి పూజలు చేసేందుకు యువజన సంఘాలు, ఆలయ కమిటీలు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిత్యపూజలు అందుకోనుంది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారు రోజుకో రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. జగదాంబను ఆరాధించే వారికి శుభం కలుగుతుందని దేవీ పురాణం చెబుతోంది.

ముస్తాబైన మండపాలు.. ఆలయాలు

అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కోసం నగరంలోని చైతన్యపురిలో గల మహాశక్తి ఆలయం, వావిలాలపల్లిలోని కనకదుర్గ ఆలయం, అంబాభవానీ ఆలయం, యజ్ఞవరాహక్షేత్రం, టవర్‌సర్కిల్‌లతో పాటు పలు వీధుల్లో దేవీ మండపాలను అద్భుతమైన సెట్టింగులతో రూపొందించారు. రోజురోజుకూ దేవీ నవరాత్రులపై మక్కువ పెరుగుతుండగా.. యువతరం తమ వాడల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నగరంలోని రేకుర్తి, జ్యోతినగర్, బొమ్మకల్ బైపాస్ చౌరస్తా వద్ద విగ్రహాలను కొనుగోలు చేసి ఆయా మండపాల వద్దకు తీసుకెళ్తున్నారు. తడకల పందిళ్లు, షామియానాలతో మండపాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలతో రాత్రుళ్లు దేదీప్యమానం కానున్నాయి. రోజుకో కార్యక్రమంతో అమ్మవారి మండపాలు సందడిగా మారనున్నాయి.



గంజ్‌లో..



కోతిరాంపూర్‌లో..

'కాంగ్రెస్ గెలుపు ఖాయం'



మాట్లాడుతున్న క్రిష్టఫర్ తిలక్

కొత్తపల్లి: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి క్రిష్టఫర్ తిలక్ ధీమా వ్యక్తం చేశారు. కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కరీంనగర్ నియోజకవర్గంలోని మండల, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి గడపగడపకు కాంగ్రెస్ నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు తెలుపుతూ మేనిఫెస్టో విధివిధానాలను ప్రతీ ఇంటికి చేర్చాలని సూచించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, కరీంనగర్ నియోజకవర్గ నాయకులు రోహిత్‌రావు, నాయకులు ప్రభాకర్, మోహనాచారి, అంజన్ కుమార్, పురుమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అర్బన్, కొత్తపల్లి, కరీంనగర్‌రూరల్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



మాట్లాడుతున్న బామండ్ల నందు

కరీంనగర్‌కల్చరల్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి బామండ్ల నందు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు చెందాల్సిన ఫీరీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను రూ.5,300కోట్లను పెండింగ్‌లో ఉంచి తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూసల విష్ణు, జోనల్ ఇన్‌చార్జిలు మధు, శ్రీవర్ధన్, సంయుక్త కార్యదర్శి వంశీ, యోగేష్ పాల్గొన్నారు.

పతకాలతో తిరిగొస్తాం

- సౌత్ ఇండియా జూనియర్స్ అథ్లెటిక్స్‌కు మనోళ్లు
- నేటి నుంచి హన్మకొండలో పోటీలు



కరీంనగర్‌స్పోర్ట్స్: రన్నింగ్‌లో చిరుతలా దూసుకుపోతాం.. జంప్స్‌లో ఎగిరి దూకేస్తాం.. త్రోస్‌లో ఆకాశాన్నంటేలా విసిరేస్తాం.. ఇదేదో సినిమా డైలాగులు అనుకుంటే పొరపాటే. ఆదివారం నుంచి హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగనున్న దక్షిణ భారతస్థాయి జూనియర్స్ పురుషుల, మహిళల అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సత్తా చాటేందుకు జిల్లాలోని కొందరు క్రీడాకారులు సమాయత్తమయ్యారు. వారిని శిక్షణ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయని అడుగగా పై విధంగా నవ్వుకుంటూ సమాధానమిచ్చారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్ పోటీలో సత్తా చాటి సౌత్ ఇండియా పోటీలకు పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పోటీలు జరుగనున్న నేపథ్యంలో పలువురు క్రీడాకారులు తమ మనోభావాలను వెల్లడించారు. పోటీల్లో తమ సత్తా చాటి పతకాలతో తిరిగొస్తామంటున్నారు.

ఒక్క పతకమైనా సాధిస్తా..



హన్మకొండలో జరుగనున్న సౌత్ అథ్లెటిక్ పోటీల్లో 3కే, 5కే స్టిపుల్ చేజ్ ఈవెంట్‌కు ఎంపికయ్యా. పోటీల్లో కనీసం ఒక్క పతకమైనా సాధించాలనుకుంటున్న. కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 3కేలో గోల్డ్, 5కేలో సిల్వర్ సాధించా. గతంలో రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించా. నేషనల్ క్రాస్ కంట్రీ పోటీల్లో కూడా పాల్గొన్న. ప్రస్తుత పోటీల కోసం ప్రాక్టీస్ బాగా చేశా.

- ఏ. వినయ్‌కుమార్

ఆశలున్నాయి..



కరీంనగర్ వేదికగా 9వ రాష్ట్రస్థాయి జూనియర్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించాం. జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు సౌత్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులందరూ మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారు. పతకం సాధించేందుకు సాధన కూడా చేశారు. పతకం సా ధించే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టా రు. పతకాలపై ఆశలు కూడా ఉన్నాయి.

- కదారి రవి, అథ్లెటిక్ సంఘం కార్యదర్శి

హెప్టాథ్లన్ ఈవెంట్‌లో పాల్గొంటున్న



హెప్టాథ్లన్ ఈవెంట్ నాది. ఏడు విభాగాల్లో పాల్గొని అందులో వచ్చిన స్కోర్ ఆధారంగా మెడల్ డిసైడ్ చేస్తారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించా. లాస్ట్ ఇయర్ సిల్వర్ మెడల్ సాధించా. ఫస్ట్ టైమ్ సౌత్ ఇండియా పోటీల్లో పాల్గొంటున్న. పతకం సాధించాలనేదే నా ఆశయం. - ఎం.సుదీక్ష

సౌత్ ఇండియా పోటీల్లో ఫస్ట్ టైమ్



సౌత్ ఇండియా జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొనడం ఫస్ట్ టైమ్. 10 కిలోమీటర్ల రేస్ వాక్ ఈవెంట్‌లో పాల్గొంటున్న. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించా. వరంగల్‌లో జరుగనున్న పోటీల్లో సైతం ఏదైనా ఒక పతకం సాధించాలని ఉంది. ప్రతిరోజూ ప్రాక్టీస్ బాగా చేశా. - సాయి గణేశ్

10 కిలోమీటర్ల రేస్ వాక్



హన్మకొండలో జరుగనున్న దక్షిణ భారతస్థాయి జూనియర్స్ మెన్ విభాగంలో 10 కిలోమీటర్ల రేస్ వాక్‌లో పాల్గొంటున్న. కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించా. గతంలో తెలంగాణ స్టేట్ సీనియర్స్ 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో బంగారు పతకం సాధించా. ప్రస్తుత పోటీల్లో పతకంతో తిరిగిరావాలని ఉంది.

- ఈ.విష్ణువర్ధన్

పతకంతో తిరిగొస్తా..



కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ మీట్‌లో 400 మీటర్ల రన్నింగ్, ట్రయథ్లన్ ఈవెంట్స్‌లలో సిల్వర్ మెడల్ సాధించా. చాలా హ్యాపీగా ఉంది. ఇప్పుడు కూడా రెండు ఈవెంట్‌లలో ప్రతిభ చాటేందుకు సిద్ధమయ్యా. రెండింట్లో ఏదో ఒక దానిలో పతకం సాధించాలని అనుకుంటున్న. పతకంతో తిరిగొస్తా.

- జి.నక్షత్ర